## ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా బదిలీ

బీబీనగర్, మే 7 : మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన వికాస్ భాటియా బదిలీ అయ్యారు. మే 8 2020లో డైరెక్టర్‌గా బీబీనగర్‌కు వచ్చిన ఆయన తన పదవీ కాలం ఐదు సంవత్సరాలు పూర్తి కావడంతో భువనేశ్వర్ ఎయిమ్స్‌కు బదిలీ అయ్యారు. బుధవారం బీబీనగర్ ఎయిమ్స్‌లో బాధ్యతలను ముగించుకొని గురువారం భువనేశ్వర్ ఎయిమ్స్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి ఎయిమ్స్‌లో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అహెంతం సంతసింగ్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించగా గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## గుట్టలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాదగిరిగుట్ట, మే 7 : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో నేడు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సురేంద్రనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిస్ వరల్డ్ పోటీ దారులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి రానున్నందున. పట్టణంలోని రహదారులకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రంగులు వేయనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి వైకుంఠ ద్వారం నుంచి గుండ్లపల్లి, మార్కెట్ యార్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.


# నమస్తే తెలంగాణ

# యాదాద్రి భువనగిరి

I | నల్లగొండ, గురువారం 8 మే 2025 | YADADRI BHUVANAGIRI


## కేజీబీవీ విద్యార్థినికి విమానం టికెట్

### టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు కలెక్టర్ సొంతంగా అందజేత

రామగిరి, మే 7 : బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు పదో తరగతి వార్షిక పరీక్షల ముందు నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి కేజీబీవీ విద్యార్థినులకు ఓ హామీ ఇచ్చారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని తన సొంత ఖర్చులతో విమానంలో పంపిస్తానని ప్రకటించారు. పదో తరగతి ఫలితాల్లో మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థిని ప్రసన్న 600 మార్కులకుగానూ 563 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు కలెక్టర్ త్రిపాఠి బుధవారం తన కార్యాలయానికి ప్రసన్నతోపాటు మాడ్గులపల్లి కేజీబీవీ ఎస్‌ఓ కె.సునీతను పిలిపించారు. ఈ నెల 17న ప్రసన్న, సునీత ఇద్దరిని తన సొంత ఖర్చులతో విమానంలో విశాఖపట్నం పంపించి ఈ నెల 19వరకు అక్కడే గడిపేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వారు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, డీఈఓ బి.భిక్షపతి ఉన్నారు.



విద్యార్థిని ప్రసన్నకు విమానం టికెట్ అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన డీఎస్‌ఓ

# గోనె సంచుల్లేవు... లారీలు రావు

## ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగేదెలా?



ముశంపల్లిలో అకాల వర్షంతో తడిసిన ధాన్యం

- ఆది నుంచీ పట్టీపట్టనట్లుగా ఉన్నతాధికారులు
- చేతులు ఎత్తేసిన సివిల్ సప్లయ్ అధికారులు
- కలెక్టర్ వస్తేనే కదులుతున్న ధాన్యం
- కొన్నిచోట్ల నెల నుంచి కేంద్రాల్లోనే వడ్ల రాశులు
- పట్టించుకునేవారు లేక రైతుల పడిగాపులు
- నిత్యం వెంటాడుతున్న అకాల వర్షం
- తడిసి ముద్దవుతున్న ధాన్యం... తిరిగి ఆరబెట్ట లేక రైతుల అవస్థలు
- తీవ్ర ఆందోళనతో రోడ్డెక్కుతున్న అన్నదాతలు

నల్లగొండ ప్రతినిధి, మే7 (నమస్తే తెలంగాణ) : ఈ నెల ఒకటి.. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం. ఇక్కడ అవసరమైన లారీలు లేక ధాన్యం తరలింపు ఆలస్యం చేస్తున్నారని కలెక్టర్ ఇలా త్రిపాఠికి తనిఖీ సమయంలోలో రైతులు పిర్యాదు చేశారు. ఎక్కువ లారీలు పెట్టాలని ఆదేశించినా నిర్లక్ష్యంగా ఉన్న లారీ కాంట్రాక్టర్‌పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అతడిపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత కూడా కొనుగోళ్ల తీరులో పెద్దగా మార్పు లేదు.

ఈ నెల 3.. కనగల్ మండలం లచ్చిపురం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం.. ఇక్కడ లారీలు లేక ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నట్లు కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. వెంటనే అవసరమైన లారీలు రప్పించి ధాన్యం తరలించాలని, జాప్యం లేకుండా కొనుగోళ్లు జరుపాలని కలెక్టర్ ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

ఈ నెల 5.. చండూరు మండలం పుల్లెంల ఐకేపీ కొనుగోలు కేంద్రం.. ఇక్కడ లారీలు రాక ధాన్యం కొనుగోళ్లల్లో తీవ్ర ఆలస్యం అవుతుందన్న పిర్యాదుతో కలెక్టర్ తనిఖీ చేశారు. వాస్తమేనని తేలడంతో తక్షణమే అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ నెల 6.. గుర్రంపోడు మండలం కొప్పోలు, గుర్రంపోడు కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ పర్యటించారు. ఇక్కడా లారీల సమస్యతోనే కలెక్టర్ తనిఖీలు చేయాల్సి వచ్చింది. ధాన్యం తరలింపునకు లారీలు లేవని గుర్తించి తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లారీ కాంట్రాక్టర్‌తోపాటు స్థానిక లారీలను కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాన్స్‌పోర్ట్ సమస్య రావద్దని హెచ్చరించారు.

ఈ నెల 7.. నార్కట్‌పల్లి మండలం షాపల్లి శివారులోని ఐకేపీ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ చేశారు. లారీలు రాకనే ధాన్యం తరలించలేదని, మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయిందన్న ఫిర్యాదుతో కలెక్టర్ ఇక్కడ పర్యటించారు. లారీలపై ఆరా తీస్తే ఈ నెల రెండు, 5వ తేదీన మాత్రమే లారీ వచ్చినట్లు తేలింది. లారీల సంఖ్య పెంచితేనే త్వరగా ధాన్యం కాంటా అవుతుందని రైతులు కలెక్టర్‌ను వేడుకున్నారు. ఇదే రోజున శాలిగౌరారం మండలం రామగిరి ఐకేపీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఇక్కడా రెండు రోజుల నుంచి లారీలు రాకనే కొనుగోళ్లు జరగడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు.

ఇలా నల్లగొండ జిల్లా పరిధిలో ఏ కొనుగోలు కేంద్రంలో చూసినా కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనిపిస్తున్నది. కొనుగోళ్లల్లో తీవ్ర జాప్యంంతో రైతులు రోడ్లు ఎక్కుతుండడంతో ఏకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా కొనుగోలు కేంద్రాల్లో పర్యటించక తప్పడం లేదు. కలెక్టర్ వస్తే తప్ప ధాన్యం కొనుగోళ్లలో కదలిక ఉండడం లేదు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఆటంకాలను గుర్తించి వాటిని అధిగమించడంలో ఇతర అధికారులు చేతులెత్తేశారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో కలెక్టర్ త్రిపాఠి.. అదనపు కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తే తప్ప పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండడం లేదు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు కలెక్టర్ పరిశీలనలో ప్రతి చోటా వెల్లడైంది. ధాన్యం తరలింపు కాంట్రాక్ట్ దక్కించుకున్న లారీల కాంట్రాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమైంది. సదరు కాంట్రాక్టర్‌పై ప్రారంభం నుంచి జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోపాటు ఆయన తన రాజకీయ పలుకుబడితో అధికారుల ఆదేశాలను భేఖాతరు చేస్తూ నిర్లక్ష్యం చేస్తుండడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తరలింపునకు నిత్యం కనీసం 300 లారీలు పెట్టాల్సి ఉండగా, కేవలం 150కి దాటడం లేదని సమాచారం. లారీల కాంట్రాక్టర్‌ను కలెక్టర్ స్వయంగా హెచ్చరిస్తున్నా స్పందన ఉన్న దాఖలాలు లేవు. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని, అందుకే లారీలను సమకూర్చలేక పోతున్నామని కాంట్రాక్టర్ ఎదురు చెప్తున్నట్లు సమాచారం. ఇదే విషయంలో మిల్లర్లు సైతం తాలు, తేమ పేరుతో క్వింటాకు రెండు కిలోల వరకు తరుగుకు అంగీకరిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని కొర్రీలు పెడుతుండడంతో ఒక్కో లారీ రెండు, మూడు రోజులు మిల్లుల వద్దే ఆగిపోతున్నది. మిల్లర్లతో సంప్రదింపులు జరిపి వెంట వెంటనే సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇలా ప్రతి దశలోనూ ఆటంకాలతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసుకుని రైతులు ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల నెల రోజులకు పైగా రైతులు ధాన్యం తెచ్చి వేచిచూస్తున్నారు. ఈ మధ్యలోనే పలుమార్లు అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దయితే తిరిగి ఆరబెట్టలేక రైతులు బేజారవుతున్నారు. ఎప్పటికి కొనుగోళ్లు పూర్తవుతాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

మరోవైపు గోనె సంచుల కొరత కూడా తీవ్రంగా వేధిస్తున్నది. అవసరమైన గన్నీ బ్యాగులను తెప్పించి సకాలంలో కేంద్రాలకు సరఫరా చేయడంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని తిప్పర్తి మండలం బండ్లోరిగూడెం కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు లేక కొనుగోళ్లు ఆపేశారు. సివిల్ సప్లయ్ మేనేజన్‌ను గోనె సంచుల కోసం ఒకటికి పదిసార్లు బతిమాలికోవాల్సి వచ్చింది. త్రిపురారం, కట్టంగూర్, కనగల్, హాలియా, వేములపల్లి, పెద్దవూర, మునుగోడు, నార్కట్‌పల్లి మండలాల్లోనూ గోనె సంచులు లేక ధాన్యం కాంటాలు నిలిచిపోయాయి. జిల్లాకు సుమారు తక్షణమే 50వేల గన్నీ బ్యాగులు అవసరం ఉన్నట్లు తెలిసింది. వీటిని తెప్పించడంలో అధికారుల విఫలం అవుతున్నారని రైతులు వాపోతున్నారు.

నల్లగొండ జిల్లాలో ధాన్యం రైతులు 40 రోజులకు పైగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందరికీ అన్నం పెట్టే రైతుల జీవితాలతో ముడిపడి ఉన్న ధాన్యం కొనుగోళ్లపై ఆది నుంచి ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి పట్టింపు లేదు. భూ భారతి, ఇతర పథకాలే తమ ప్రాథమ్యాలు అన్నట్లుగా ధాన్యం కొనుగోళ్లను ద్వితీయ ప్రాధాన్యతగానే గుర్తించినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. వాస్తవంగా ధాన్యం కొనుగోళ్లపై ఆరంభం నుంచే జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల విభాగం అధికారులు సీరియస్‌గా మానిటరింగ్ చేయాలి. కానీ.. కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులకు భూ భారతి అవగాహన సదస్సులతో సరిపోతుండగా, కీలక సమయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు సెలవుపై వెళ్లడంతో కొనుగోళ్లపై పర్యవేక్షణ లేకుండా పోయింది. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం, పౌర సరఫరాల అధికారి సైతం కొత్తవాళ్లు అవడంతో ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది. దాంతో కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తున్నది. వీరికితోడు ఈ యాసంగిలో రైతులను ప్రకృతి పగబట్టిందా అన్నట్లు నిత్యం ఏదో ఒక చోట అకాల వర్షం రైతులను బెంబేలెత్తిస్తున్నది. అకాల వర్షాలతో ధాన్యం రాశులు కొట్టుకుపోవడం, తడిసి ముద్దవడం, తిరిగి ఆరబెట్టడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. నేటికీ జిల్లాలో ఇంకా 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు సిద్ధంగా ఉన్నట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో మొత్తం 5.75లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నేటికీ 4.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు రాగా, 3.90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంటాలు పూర్తి చేశారు. మరోవైపు మిల్లుల వద్ద లారీల్లో నుంచి దిగుమతి అయ్యాక ట్రక్‌షీట్లు జారీ అయ్యింది మాత్రం సుమారు 2.50లక్షల మెట్రిక్ టన్నులే కావడం గమనార్హం. ప్రతి దశలోనూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ధాన్యం ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయి కనిపిస్తున్నది.

### అకాలవర్షంతో తడిసిన ధాన్యం

నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసుకున్న ధాన్యం బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి తడిసి ముద్దయింది. ఈ సెంటర్‌లో ఇప్పటి వరకు 50 శాతం కొనుగోళ్లు కూడా జరగలేదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

– నల్లగొండ రూరల్, మే 7

## నెల రోజులైనా కొనుగోళ్లు లేవు..

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం ఎన్జీకొత్తపెల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో వడ్లు పోసి నెల రోజులైనా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం ఎండకు, రాత్రిళ్లు వస్తున్న వానకు అవస్థలు పడుతూ.. రోజూ ధాన్యం రాశుల దగ్గరే పడిగాపులు గాస్తున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు కూడా లారీల కొరత ఉండడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ 6వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, మరో 4వేల క్వింటాళ్ల వరకు పోగుపడి ఉన్నాయి. మొదట్లో రోజు విడిచి రోజు లారీలు రాగా, వారం నుంచి లారీల కొరత తీవ్రంగా ఉందని రైతులు వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు నిల్వ ఉండడంతో వర్షానికి తడుస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. దాదాపు 1,800 బస్తాల ధాన్యం తూకం వేసి ఉండగాచ సోమవారం రాత్రి కురిసిన అకాల వర్సానికి తడిశాయి.



శాలిగౌరారం : ఎన్జీకొత్తపెల్లి ఐకేపీ కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

### వడ్లు తిరుగబోయలేక చస్తున్నాం



మా వడ్లు అమ్ముకునేందుకు ఎన్జీకొత్తపల్లిలోని ఐకేపీ కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులైంది. ఎంతకని ఆరబోయాలి. తిరగబోయలేక చస్తున్నాం. ఇంకా తూకం వేస్తలేరు. ఇంత దరిద్రం ఎప్పుడూ లేదు. వడ్లు ఎండకు ఎండి వానకు తడుస్తున్నాయి. పచ్చిగ ఉంటేనేమో అధికారులు కొంటలేరు. తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టాలంటే యాష్టకొస్తున్నది.

-మామిండ్ల జయమ్మ, మహిళా రైతు, ఎన్జీకొత్తపల్లి (శాలిగౌరారం మండలం)



నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో ఊయలను ప్రారంభిస్తున్న అధికారులు

## పోషించలేమనుకున్న పిల్లలకు ‘ఊయల’

### శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు

రామగిరి, మే 7: పోషించలేని, వదిలివేయబడ్డ పిల్లలను సంరక్షించడం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రసూతి వైద్యశాలలు, జిల్లా దవాఖాన, శిశు గృహలో ప్రత్యేకంగా ఉయ్యాల ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో బుధవారం శిశువుల స్వీకరణ కేంద్రంతోపాటు ఊయల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా అనాథ బాలలను వదిలేయడం చేయకూదడని తెలిపారు. పిల్లలను పోషించలేని పరిస్థితి ఉన్నట్లయితే తమకు సమీపంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఊయలలో అప్పగించాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, సభ్యులు భాస్కర్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ అరుణకుమారి, రీజినల్ మెడికల్ ఆఫీసర్, బీఆర్‌బీ కోఆర్డినేటర్ హరిత పాల్గొన్నారు.



పోచంపల్లి టూరిజం పార్క్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

## ముస్తాబవుతున్న పోచంపల్లి టూరిజం పార్క్

### 15న అందాల భామల బృందం సందర్శన

భూదాన్‌పోచంపల్లి, మే 7 : హైదరాబాద్ వేదికగా ఈ నెల ఏడో తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే పలు దేశాలకు చెందిన సుందరీమణులు చేనేతకు ప్రసిద్ధి చెందిన గ్రామీణ పర్యాటక కేంద్రం భూదాన్ పోచంపల్లికి రానున్నారు. ఈ నెల 15న వారి రాక కోసం పోచంపల్లిలోని టూరిజం పార్కును ముస్తాబు చేస్తున్నారు. పది రోజులుగా పార్కులోని ఇంటీరియర్‌తోపాటు బయటి ప్రాంగణమంతా రంగులువేస్తూ సుందరీకరిస్తున్నారు. మ్యూజియం, హంపి థియేటర్, గెస్ట్ రూములను అలంకరిస్తున్నారు. పచ్చదనంతో కూడిన లాన్స్, ప్రకృతి అందాలు ఇనుమడింపజేసేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. అందాల భామలకు చేనేత థీమ్స్ ప్రతిబింబించేలా అధికారులు కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. చేనేత మ్యూజియంలో గోడలకు పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట, గొల్లభామ, నారాయణపేట, గద్వాల వస్త్రాలతో అలంకరించనున్నారు. టూరిజం ప్రాంగణంలో చేనేత వస్త్రాల తయారీ విధానాలు లైవ్ డెమోన్‌స్ట్రేషన్‌తోపాటు, చేనేత ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్థానిక మహిళలు అందాల భామలకు ఘన స్వాగతం పలికేలా, హంపి థియేటర్ వద్ద చేనేత కార్మికులతో ముఖాముఖి, అందాల భామలు చేనేత వస్త్రాలు ధరించి రాంప్ వాక్ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15న సాయంత్రం 6 నుంచి 8:30 గంటల వరకు కార్యక్రమాలు జరుగనుండగా, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, పోచంపల్లి మిస్ వరల్డ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ కె. లక్ష్మి, టూరిజం శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అందాల భామల రాక కోసం భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, చౌటుప్పల్ సీఐ రాములు తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలుగా నిరుద్యోగ యువత



తుంగతుర్తిలో ఉపాధి హామీ కూలీ పనులు చేస్తున్న నిరుద్యోగ యువత

తుంగతుర్తి, ఏప్రిల్ 7 : తుంగతుర్తి మండల కేంద్రంలో బుధవారం నిరుద్యోగ యువకులు ఉపాధి హామీ పని చేస్తూ కనిపించారు. వేసవి సెలవులు కావడంతో గ్రామాలకు వచ్చిన యువకులు ఉపాధి హామీ పథకంలో కూలీలు కార్డులు పొందారు. ఇందులో బీటెక్, పీజీ, బీఈడీ డిగ్రీలు పూర్తి చేసిన వారు సైతం ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాలు లేక ఖాళీగా ఉండలేక ఉపాధి పనులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, ఉపాధి మార్గాలు చూపడం లేదని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో భాగంగా యువ వికాసం పథకం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు ఇవ్వాలని కోరారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా ఏటా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో నిరుద్యోగులు బొంకూరి మల్లేశ్, బొజ్జ సాయికిరణ్, మల్లెపాక ప్రదీప్, కొండగడుపు వెంకటేశ్, పోలేపాక రాజేశ్, బొంకురి మధు, చింతకుంట్ల సురేశ్, భాను, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



యాదగిరిగుట్ట కొండపైన తనిఖీలు చేపడుతున్న డాగ్ స్క్వాడ్

## ముమ్మర తనిఖీలు

పాకిస్తాన్‌లో ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేసిన దాడి నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో బుధవారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లాలో రద్దీగా ఉండే ప్రాంతాలైన యాదగిరిగుట్ట కొండపై, భువనగిరి రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లలో బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

– ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువననరి



భువనగిరి రైల్వే స్టేషన్‌లో..



నల్లగొండ జిల్లా బుక్ డిపోకు చేరుకున్న పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

## జిల్లా బుక్ డిపోకు పాఠ్య పుస్తకాలు

### బుధవారం నుంచి మండల కేంద్రాలకు తరలింపు షురూ

రామగిరి, మే 7 : వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరిచే సమయానికే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ్య ముందస్తు చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు పుస్తకాలు జిల్లా బుక్ డిపోకు రాగా వాటిని ఆయా మండల విద్యాధికారి కార్యాలయాలు పంపించే ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. నల్లగొండ జిల్లాలోని 32 మండలాల్లో 1,637 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల, మోడల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 1,43,982 మంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తుంది. వీరికి 5,89,970 పుస్తకాలు అవసరం కాగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని బుక్ డిపోకు 3,67,940 పుస్తకాలు చేరాయి. మిగతావి త్వరలో వస్తాయని బుక్‌డిపో మేనేజర్ వెంకటాచారి తెలిపారు. జూన్ 1న బడిబాటతో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి.

### పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా అందజేత : బి.భిక్షపతి, నల్లగొండ డీఈఓ

జిల్లా కేంద్రంలోని బుక్‌డిపోకు చేరిన పాఠ్య పుస్తకాలను ఎంఈఓలు పెట్టిన ఇండెంట్ మేరకు అందజేస్తాం. బుధవారం పుస్తకాల పంపిణీని ప్రారంభించి తిప్పర్తి, నల్లగొండ మండలాలతోపాటు బీసీ గురుకులాల పాఠశాలలకు పంపించాం. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎంఈఓలు జిల్లా బుక్ డిపో నుంచి తమ కార్యాలయాలకు వచ్చిన పుస్తకాలను పాఠశాలలకు పంపించాలి.